క్లుప్తంగా

ఉపాధి హామీలో మేట్లకు శిక్షణ


పరిషత్ కార్యాలయంలో సదస్సులో పాల్గొన్న అధికారులు మల్లికార్జునరావు, కవిత

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని మేట్లకు వివిధ అంశాలపై అధికారులు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. మస్టరు నిర్వహణ, ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు, కొలతలు, 100 రోజుల పనిదినాలు కల్పించడం వాటిపై పి.గన్నవరం క్లస్టర్ ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు, జాబ్ కార్డ్స్-బెనిఫిట్స్ ఏపీడీ జి.కవిత అవగాహన కల్పించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో ఎండీ నాగప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్ త్రినాథ్, జేఈ ఎస్.శ్రీను పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థుల గైర్హాజరు

అంబాజీపేట: మండలంలో మూడు కేంద్రాల్లో బుధవారం జరిగిన పదో తరగతి సోషల్ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు తెలిపారు. అంబాజీపేట నుంచి 143 మందికి 142, తొండవరం నుంచి 159 మందికి 158, పుల్లేటికుర్రు నుంచి 187 మందికి 186 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మూడు కేంద్రాల నుంచి ఒక్కొక్కరి చొప్పున పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవోలు తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుని విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: ఇసుకపూడి శివారు జక్కంశెట్టి వారిపాలెంలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా ప్రతిష్ఠించారు. జక్కంశెట్టి గంగిశెట్టి స్థాపించబడిన ఆలయం నందు బ్రహ్మశ్రీ ఎస్ఎస్‌వీఎల్ఎన్ శర్మ (బుజ్జి) పర్యవేక్షణలో స్వామి వారికి రత్నన్యాసం, గర్త న్యాసం, నవ ధాన్యాలు, నవరత్నాలు, మహాపూర్ణాహుతి, స్వర్ణయంత్ర ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు.

ఘనంగా గణపతి కల్యాణం


మాచవరంలో గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు

అంబాజీపేట: మాచవరం గ్రామ పంచాయతీ సమీపాన వేంచేసిన సిద్ధి, బుద్ధి సమేత యువగణపతి స్వామి వారి కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొడమంచిలి వెంకటకృష్ణ నాగేశ్వరరావుశర్మ పర్యవేక్షణలో స్వామి వారి దివ్య కల్యాణాన్ని జరిపారు. దొమ్మేటి త్రిమూర్తులు, సూర్య కుమారి, చిరంజీవి, కనకదుర్గ వినోద్‌కుమార్ నాగలక్ష్మిల సహకారంతో భారీ అన్నసమారాధన చేశారు.

'మేమంతా సిద్ధం' బస్సుయాత్రతో మరోచరిత్ర


శివకోడు శివాలయంలో పూజలు చేస్తున్న గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: 'మేమంతా సిద్ధం' పేరుతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన బస్సు యాత్ర రాష్ట్రంలో మరో చరిత్ర సృష్టించబోతుందని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన శివకోడులోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర విజయవంతం కోరుతూ స్వామి వారిని దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. గొల్లపల్లి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 21 రోజుల పాటు బస్సుయాత్ర కొనసాగుతుందన్నారు.

తాచుపాము హల్‌చల్


గోపీ ఇంటి ఆవరణలో హల్‌చల్ చేసిన పాము

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెం గ్రామంలోని కొర్లపాటి గోపీ ఇంటి ఆవరణలో బుధవారం రాత్రి ఆరు అడుగుల గోధుమ తాచు హల్‌చల్ చేసింది. గోపీ కుటుంబ సభ్యులందరూ భయభ్రాంతులకు గురై స్నేక్ కేచర్ వర్మకు ఫోన్ చేసి సమాచారం తెలియజేశారు. అతడు తాచుపామును పట్టుకుని జనసంచారం లేని ప్రాంతంలో వదిలివేశాడు.

ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

ఆర్డీవో, కొత్తపేట సీఆర్‌ఓ సత్యనారాయణ


మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విధులు, నిబంధనలపై సమావేశం


కొత్తపేట సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

కొత్తపేట: నియోజకవర్గంలో ఎన్నికలు ప్రజా స్వామ్య స్ఫూర్తితో సజావుగా నిర్వహించడానికి పకడ్బందీగా పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్టు స్థానిక ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీవీ సత్యనారాయణ తెలిపారు. జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీలు, ఏఈఆర్‌ఓలు, వివిధ టీమ్‌లతో ఎన్నికల నియమ నిబంధనలు, ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్లు, పోలింగ్ బూత్‌లు, సాధారణ, సమస్యాత్మక ప్రాంతాలు, ఎన్నికల టీమ్‌లు నియామకం తదితర అంశాలు వివరించారు. నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో ఇప్పటి వరకూ ఫైనల్ పబ్లికేషన్ ప్రకారం 2,48,392 మంది ఓట్లు కాగా వారిలో 1,23,389 మంది పురుషులు, 1,24,998 మంది మహిళలు, ఐదుగురు ఇతరులు ఉన్నారన్నారు. మొత్తం 262 పోలింగ్ కేంద్రాలు కాగా అవి 148 ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. వాటిలో 97 (134 పోలింగ్ బూత్‌లు) సాధారణ ప్రాంతాలు కాగా 51 (128 పోలింగ్ బూత్‌లు) సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామన్నారు. 262 బూత్‌లను 21 సెక్టార్లుగా, 21 రూట్‌లుగా విభజించామన్నారు. 9 ఫ్లయింగ్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆయా టీమ్‌లలో సబ్ డివిజన్, మండల స్థాయి అధికారులను నియమించామన్నారు. జొన్నాడ, ఈతకోట, బొబ్బర్లంక వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ఇంత వరకూ రూ.2.10 లక్షలు నగదు సీజ్ చేశామన్నారు. రూ.50 వేలు వరకూ తీసుకువెళ్లడానికి అభ్యంతరం లేదని, 50 వేలు దాటితే దానికి తగిన ఆధారాలు చూపించాలన్నారు. రూ.10 లక్షల్లోపు జిల్లా స్థాయిలో త్రీమెన్ కమిటీ, రూ.10 లక్షలు దాటితే ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి వస్తాయన్నారు. నియోజకవర్గంలో 3 పోలింగ్ బూత్‌ల వద్ద డ్రింకింగ్ వాటర్, ర్యాంపులు, కరెంట్, వేసవిని దృష్టిలో పెట్టుకుని టెంట్లు, పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కొత్త ఓట్ల నమోదుకు, ఓటు షిఫ్టింగ్‌కు నామినేషన్ల చివరి రోజు వరకూ అవకాశం ఉందన్నారు. హిందూ దేవాలయాలు, చర్చిలు, మసీదులకు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల ఎన్నికల కార్యాలయాల ఏర్పాటుకు అనుమతించమన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద, 48 గంటల్లో పబ్లిక్ ప్లేసుల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ రిపోర్టు చేసిన 100 నిమిషాల్లో తగు చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించి డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రచారానికి అవసరమయ్యే వాహనాలు, ఇతర అనుమతులు సువిధ యాప్ ద్వారా పొందే అవకాశం ఉందన్నారు. యాప్ ద్వారానే కాకుండా నేరుగా ఆర్‌ఓ, ఏఈఆర్‌ఓకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వాహనాల అనుమతికి వాహన రిజిస్ట్రేషన్ వివరాలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన యజమాని పేరు. చిరునామా, సెల్ నంబర్ వివరాలు జతచేయాలన్నారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు, ఎలక్షన్ డీటీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు, నిబంధనలపై అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు(గ్రేడ్ 1 నుంచి 5 వరకూ), వీఆర్వోలు, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎన్నికల విధులు, నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, తహసీల్దార్ సీహెచ్.పెద్దిరాజు అవగాహన కల్పించారు. అలాగే సమ్మర్ డ్రింకింగ్ వాటర్ యాక్షన్ ప్లాన్, ఎంసీసీ నిమిత్తం పంచాయతీల పరిధిల్లో కోడ్ సక్రమంగా అమలు చేయడంపైన అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.శిరీష పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ సంక్షేమానికి ప్రాధాన్యం


తాటిపాకలో గొల్లపల్లిని కలసి మద్దతు పలికిన అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి బాటలు వేశారని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం మలికిపురం మండలం అడవిపాలెం సర్పంచ్ కొల్లు అనంతలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు తాటిపాకలో గొల్లపల్లి సూర్యారావు స్వగృహం వద్ద ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని సంఘ నాయకులు గొల్లపల్లికి మద్దతు తెలిపారు. గొల్లపల్లి మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులకు సామాజికంగా, ఆర్థికంగా తోడ్పాటు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. పార్టీ నాయకులు కొల్లు నరసింహస్వామి, బొమ్మిడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


నూతనంగా ప్రతిష్ఠించిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు
- ఆలయానికి రూ 1.50 లక్షల విరాళం

ఆలమూరు: మండలంలోని మడికిలో నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్టు నిధులతో పాటు గ్రామస్తుల విరాళాలతో స్థానిక తూర్పు వీధి గొయ్యి ప్రాంతంలో నిర్మించిన ఈ ఆలయంలోని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రముఖ వేద పండితుడు బ్రహ్మశ్రీ కాళ్లకూరి కామేశ్వరశర్మ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని గత మూడు రోజుల నుంచి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న హోమాలు ముగిశాయి. అలాగే అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం మహిళలు గోదావరి జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన జరిగింది.

ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.1.5 లక్షల విరాళం

గ్రామంలో నూతనంగా నిర్మించిన నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రూ.1.5 లక్షలను విరాళంగా అందజేశారు. ఇప్పటికే శ్రీవాణి ట్రస్టు నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మళ్లీ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తుండటం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు.లక్ష్మి మౌనిక, పడమట రాంబాబు, ఉండ్రాజపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఈసారీ జయం మనదే..

- ఎంపీ అభ్యర్థి రాపాక, ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి
- ఎన్నికల ప్రచార రథం ప్రారంభం


మలికిపురంలో ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ఈసారి కూడా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీదే విజయమని అమలాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. బుధవారం మలికిపురంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం రథాన్ని రాపాక వర ప్రసాదరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రథంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇరువురూ మాట్లాడుతూ ఈ రోజు సీఎం జగన్ అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి ఇంట్లోనూ ఉన్నాయన్నారు. పని చేసి చూపించి ఎన్నికలకు వెళ్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. దేశంలోనే ఇంతటి ఘనత సాధించిన సీఎం ఎక్కడా లేరని అన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓట్లు వేస్తారని అన్నారు. జగన్ లాంటి అరుదైన వ్యక్తి మరలా రాష్ట్రానికి సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్రంలో ప్రతి పౌరునికీ ఉందన్నారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో అవినీతి టీడీపీ నాయకుల చేతిలోకి రాష్ట్రం వెళితే వారి ఆర్థిక పరిస్థితులుపెంచుకుంటారన్న సంగతి ప్రజలు గుర్తించాలన్నారు. జగన్ ఇచ్చిన పథకాలు గతంలో మీరెందుకు ఇవ్వలేని ప్రజలు టీడీపీ నాయకులను ప్రశ్నించాలని సూచించారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమా మహేశ్వరరావు, నాయకులు గుబ్బల బాబ్జి, మంగెన సంహాద్రి, కూనపరెడ్డి రాంబాబు, సూరిశెట్టి బాబి, బండారు కాశి, నల్లి డేవిడ్, ఈద రవి రెడ్డి, తోట జాన్‌బాబు, గొల్లపల్లి శ్రీధర్, కొల్లాబత్తుల కుమార్, గెద్దాడ సత్యనారాయణ, కట్టా శ్రీనివాస్, రొక్కాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ వస్తేనే మంచి రోజులు

సఖినేటిపల్లి: అందరికీ న్యాయం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తేనే మంచి రోజులు వస్తాయని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం ఉయ్యూరువారి మెరకలో ఎంపీటీసీ-2 గుబ్బల ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపల్లిని వారంతా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే పార్టీ గెలుపునకు శ్రీరామరక్ష అని ఆయన అన్నారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోస్టు పెట్టే ముందు జరభద్రం

- ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపైనా ఆంక్షలు
- ద్వేషపూరిత, అలజడులు రేపే పోస్టింగులు పెట్టేవారిపై కేసులు
- వివాదాస్పద పోస్టులను ఫార్వర్డ్ చేసినా బాధ్యులే

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగేలా ఎన్నికల కమిషన్ అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాలపైనా నిఘా వేసింది. ఎవరైనా ద్వేషపూరిత, అసత్య, సమాజంలో అలజడులు రేపే పోస్టింగ్‌లు పెడితే వెంటనే చర్యలు చేపట్టే ఏర్పాట్లు చేసింది.

అధికారుల నిరంతర పర్యవేక్షణ..

మారిన టెక్నాలజీకి అనుగుణంగా సామాజిక మాధ్యమాల (వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్) ద్వారా కూడా రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని అరాచక శక్తులు విద్వేషాలు రాజేసి తమ స్వార్థానికి వాడుకునే అవకాశం లేకపోలేదు. ఇలాంటి వారిని కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ నడుం బిగించింది. సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారులు ద్వారా నిఘా ఉంచింది. ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా సందేశాలు పంపడం, తదితర కార్యకలాపాలకు పాల్పడితే ఐటీ యాక్ట్-2000 సెక్షన్-67 కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారు. సోషల్ మీడియా గ్రూపు సభ్యులు అభ్యంతరకరమైన, వివాదాస్పద పోస్టులు, కామెంట్లు పెట్టినా వెంటనే వాటిని అడ్మిన్ డిలీట్ చేయాలి. లేదంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితో పాటు గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫిర్యాదు చేస్తే కేసు..

సామాజిక మాధ్యమాల్లో ఎవరిపైనా వ్యక్తిగతంగా కానీ, పార్టీలపై కానీ, సంస్థలు, అధికార యంత్రాంగంపై కానీ అసత్య ప్రచారం చేయకూడదు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేస్తారు. చట్ట విరుద్ధమైన ప్రకటనలు, రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసినా, ఐపీసీ-504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది.

పెయిడ్ న్యూస్ కింద పరిగణనలోకి..

ఇక.. ప్రస్తుత ఎన్నికల నిబంధన మేరకు పోలింగుకు 48 గంటల ముందే సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే ఆయా పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాల నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుంది. దీంతో ఈ ఖర్చు అభ్యర్థి ఎన్నికల ఖాతాలోకి వెళ్తుంది.

నేడు దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరం


సఖినేటిపల్లి విద్యాశాఖాధికారి కార్యాలయంలో బ్రోచర్ విడుదల చేసిన ఎంఈవో

సఖినేటిపల్లి: సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో గురువారం రాజోలు భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంఈవో-1 డి.కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ మేరకు ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. శిబిరంలో దివ్యాంగ బాలలకు నిపుణులైన వైద్యులతో వైద్య పరీక్షలు చేసి, ఉపకరణాలు అందించే కార్యక్రమం చేపడుతున్నట్టు ఆయన అన్నారు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకూ ప్రాథమిక స్థాయి, 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ సెకండరీ స్థాయిలో చిన్నారులకు అవసరమైన ఉపకరణాలు శిబిరంలో అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జె.మిస్సమ్మ, సత్య, సంధ్య, రాజాబాబు, కిషోర్ పాల్గొన్నారు.

మళ్లీ అధికారం జగన్‌మోహన్‌రెడ్డిదే..


అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధి నుంచి ప్రచారం ప్రారంభించిన పినిపే విశ్వరూప్

అయినవిల్లి: మరలా రాష్ట్రం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అధికారంలోకి రానున్నారని ఆయనేతోనే రాష్ట్రం అభివృద్ధి వైపు ప్రయాణిస్తుందని వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. బుధవారం సతీసమేతంగా ఆయన పార్టీ నాయకులతో కలసి అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచార రథానికి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ తనకు విజయం చేకూర్చాలని అలాగే సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక సీట్లతో గెలిపించాలని స్వామికి పూజలు చేశానన్నారు. స్వామిని దర్శించి ప్రచారం చేయటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఏ విధమైన విఘ్నాలు లేకుండా ఎన్నికల ప్రచారం జరగాలని స్వామిని కోరానన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా ప్రయాణం చేయాలంటే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గెలిపించాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణు గోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు


అంబాజీపేటలో రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ స్టాలిన్‌బాబును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

అంబాజీపేట: శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వలంటీర్లని జిహాదీ టెర్రరిస్టులతో పోల్చడం సమంజసం కాదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ నేలపూడి స్టాలిన్‌బాబు పేర్కొన్నారు. అంబాజీపేటలో ఆయన స్వగృహం వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమ పథకాలు చేరవేయడం, ఇంటింటికీ వెళ్లి పింఛను అందించడంలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల మంది ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తలుగా వలంటీర్లు వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్న టీడీపీ శ్రేణులు వలంటీర్లపై దుష్ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. దేశంలో ఎక్కడ లేని విధంగా చక్కని రీతిలో వలంటీర్ వ్యవస్థ పనిచేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్నీ గడపగడపకూ అందిస్తూ పారదర్శకంగా వలంటీర్లు సేవ చేస్తున్న విషయం టీడీపీ నాయకులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రజలంతా వలంటీర్లకు నీరాజనాలు పలుకుతుంటే ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వలంటీర్లకు టీడీపీ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని, తమ వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మైలా ఆనందరావు, గోసంగి సత్యనారాయణ, గుర్రం నాగరాజు, కోట రామచంద్రరావు, కోట సత్తిబాబు, సాధనాల బాలకృష్ణ, మైలే రాజు, బీర సురేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తుందన్నారు. గొల్లపాలెం ఎస్ఎస్ హెచ్‌క్యూ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం, శలపాక, తణుకువాడ, మంజేరు, శీల, శీలలంక, ఒంటితాడి కాజులూరు, అయితపూడి, తిప్పరాజుపాలెం, తాళ్లరేవు మండలం బొడ్డువానిలంక, కరప మండలం కొంగోడు, గొర్రిపూడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ లైన్లలోని గృహవాసాలతోపాటు ఇండస్ట్రియల్ ఫీడర్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందని ప్రజలు సహకరించాలన్నారు.

శనైశ్చరుని హుండీల ఆదాయం రూ 2.97 లక్షలు


మందపల్లి శనైశ్చరాలయంలో హుండీల నగదు లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి ఆలయంలో హుండీల ద్వారా రూ.2,97,668 ఆదాయం వచ్చినట్టు ఏసీ, ఈఓ కె.వి జయలక్ష్మి తెలిపారు. మూడు నెలల అనంతరం ఆలయ హుండీలను ఏసీ అండ్ ఈఓ ఆధ్వర్యంలో వెలిచేరు ఆలయ ఈఓ ఆకుల సత్యవర్ధన్ సమక్షంలో తెరచి లెక్కించారు. శనైశ్చరుని హుండీ ద్వారా రూ.2,80,257, అన్నదానం హుండీ ద్వారా రూ.17,411తో పాటు క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి వారి హుండీ ద్వారా రూ.15,661 ఆదాయం వచ్చిందని విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఉత్తమకుమారి, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.